నేడు ఇద్దరు మంత్రుల రాక

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు




ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేడు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. మంత్రి తుమ్మల ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 11 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 11 గంటలకు 44వ డివిజన్ శ్రీరాంనగర్‌లో రైతుబజార్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఇతర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. అలాగే మంత్రి పొంగులేటి ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 10.30కి నేలకొండపల్లి చేరుకుంటారు. అక్కడ గంగమ్మతల్లి దేవాలయాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 11.30కి జుజ్జులరావుపేటలో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. 12 గంటలకు కూసుమంచి మండలం తుమ్మలతండాలో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. 12.30కి ధర్మాతండాలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు. 1 గంటకు ఏదులాపురం మునిసిపాలిటీలో మద్దులపల్లిలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 1. 30కి శ్రీనరగ్ కాలనీ శ్రీశ్రీసర్కిల్‌లో తన ఇంటికి చేరుకుంటారు. సాయంత్రం 4.10కి వరంగల్ క్రాస్‌రోడ్డు సమీపంలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు ఫౌండేషన్ చేస్తారు. 4.30కి గుర్రాలపాడులో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 5 గంటలకు కస్నాతండాలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 5.30కి కాచిరాజుగూడెం గ్రామంలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు. 6.20కి ఖమ్మంలో శ్రీశ్రీసర్కిల్‌లో తన ఇంటిలో బస చేస్తారు.

బ్యాంకు రుణం చెల్లించలేదని
గొర్రెల్ని తీసుకెళ్లారు..

కూసుమంచి డీసీసీబీ అధికారుల ఓవర్ యాక్షన్



కూసుమంచి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు గొర్రెలను రికవరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూసుమంచి మండలం గోరీలపాడు తండాకు చెందిన బాణోతు లింగా అనే వ్యక్తి డీసీసీబీ కూసుమంచి బ్రాంచ్‌లో రూ.50వేల ముద్రలోన్ తీసుకున్నాడు. తీసుకున్న రుణంతో మైక్రో ఫైనాన్స్ ద్వారా గ్రా మంలో వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలతో గత ఆరునెలలుగా డబ్బులు ఖర్చు కావడంతో బ్యాంకు రుణం చెల్లించలేకపోయాడు. దీంతో డీసీసీబీ బ్యాంకు మేనేజరు తమ సిబ్బందితో కలిసి మార్చి 31న లింగా ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. రుణం చెల్లించకపోవడంతో అతడి వద్ద ఉన్న మూడు గొర్రెలను జీపులో ఎక్కించుకుని వెళ్లారు. దీంతో బాధితుడు అప్పు చేసి రూ.10వేలు తీసుకొచ్చి చెల్లించడంతో అధికారులు గొర్రెలను బాధితుడి ఇంటికి తీసుకొచ్చి ఇచ్చారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై డీసీసీబీ బ్యాంకు మేనేజర్ స్రవంతిని వివరణ కోరగా మార్చి నెలాఖరు కావడంతో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బాణోతు లింగా ఇంటికి వెళ్లి రుణం చెల్లించాలని అడగ్గా 'గొర్రెలను తీసుకుపోతే తీసుకుపోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని తెలిపారు. తర్వాత రూ.10వేలు చెల్లించడంతో గొర్రెలను ఇంటికి తరలించినట్లు వివరించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

భక్తులకు సకల ఏర్పాట్లు

- మిథిల స్టేడియంలో 26 సెక్టార్లు
- ప్రతి సెక్టార్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్లు
- సీఎం రాక కోసం మూడు హెలీప్యాడ్‌లు
- దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్
- శ్రీరామనవమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

భద్రాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమికి తరలి వచ్చే భక్తులకు సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఈ.శ్రీధర్ అన్నారు. భద్రాచలంలో ఈ నెల 6న జరిగే శ్రీసీతారాముల కల్యాణం, 7న జరిగే శ్రీరామ మహాపట్టాభిషేకంపై బుధవారం భద్రాచలంలో దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఈ.శ్రీధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మిథిల స్టేడియంలో 26 సెక్టార్లు ఏర్పాటు చేశామని ప్రతి సెక్టారులో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ అందుబాటులో (మిగతా 6వ పేజీలో)

గోటి తలంబ్రాల సమర్పణ



గోటి తలంబ్రాలను సమర్పించిన కోరుకొండ భక్త బృందం

భద్రాచలంలోని శ్రీసీతా రామచంద్రస్వామి వారికి గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన భక్త బృందం బుధవారం సమర్పించింది. 2011లో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను తెచ్చే కార్యక్రమాన్ని శ్రీకృష్ణ చైతన్య సంఘానికి చెందిన భక్త బృందం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 14వసారి వారు ముందుగా పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి శిరస్సుపై గోటి తలంబ్రాలను ఉంచి జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ రామనామ స్మరణ చేస్తూ భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, వైదిక సిబ్బందికి లాంఛనంగా తలంబ్రాలను అందజేశారు.



నూతనంగా నిర్మించిన రామాలయం

దళిత బంధువు 'వల్లభి' రామయ్య

- అగ్రవర్ణాల వివక్ష భరించలేక రామాలయ నిర్మాణం
- 90 ఏళ్లుగా దళితులే పూజారులుగా ధూపదీప నైవేద్యాలు

వివరాలు : 6లో

ముగిసిన టెన్త్ పరీక్షలు



ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు ఏప్రిల్ 2తో ముగిశాయి. గురువారం, శుక్రవారం ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రధాన పరీక్షలు ముగియటంతో విద్యార్థులు ఆనందోత్సవాలతో కేరింతలు కొడుతూ ఇంటిబాట పట్టారు. మొత్తం విద్యార్థులు 16,417మందికి 16,198మంది పరీక్షలకు హాజరుకాగా, 219 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని తెలిపారు. పరీక్షలు ముగియటంతో పాఠశాలల ముందు, పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కోలాహలం ఏర్పడింది.



ప్రశాంతంగా జేఈఈ మెయిన్ పరీక్షల ప్రారంభం

- నాలుగు కేంద్రాల్లో మొదటి రోజు 944 మంది హాజరు
- 88 మంది గైర్హాజరు

7



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రేషన్ షాపులు సక్రమంగా నిర్వహించాలి

- లేదంటే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తాం
- ఇకపై రేషన్‌లో సన్నబియ్యం మాత్రమే పంపిణీ
- ఎక్కడైనా దొడ్డుబియ్యం వస్తే ఫిర్యాదు చేయాలి
- అర్హులు రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ దుకాణాలను సక్రమంగా నిర్వహించకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజీవ్ యువ వికాసం పథకం, సన్నబియ్యం పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. మన జిల్లాలో పండే సన్నధాన్యాన్ని మన జిల్లాకే కేటాయించినట్లు తెలిపారు. దొడ్డు బియ్యం పాత స్టాక్‌ను గోదాంలకు తరలించామని తెలిపారు. రేషన్‌షాపులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8గంటల వరకు విధిగా తీసి ఉంచాలని డీలర్లకు సూచించారు. రేషన్ బియ్యం స్టాకును కూడా స్టాకు బోర్డులో రాయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన 32 రకాల సన్నబియ్యాన్ని మాత్రమే పేదలకు అందిస్తున్నామన్నారు. బినామీ డీలర్ల మీద ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై ప్రతి రేషన్‌షాపులో సన్నబియ్యం మాత్రమే అందిస్తామని, ఎక్కడైనా దొడ్డు బియ్యం ఇస్తే కార్డుదారులు ఫిర్యాదుచేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటోందని, అర్హత కలిగినవారు ఈనెల 14 వరకు రాజీవ్ యువవికాసం కింద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఒక్కో యూనిట్ రూ.50 వేలనుంచి రూ.4లక్షల వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. అలాగే ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు దరఖాస్తు ప్రింట్‌ను సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలని ఆధార్, కులధ్రువీకరణ, రేషన్‌కార్డు/ఆదాయ ధ్రువీకరణ కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో లక్షన్నర లోపు, పట్టణాల్లో రూ.2లక్షల లోపు ఆదాయం ఉన్నవారు ఈ పథకానికి అర్హులని కలెక్టర్ తెలిపారు.

ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కాకుండా మూడు రోజుల్లోనే అందించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశామన్నారు. ప్రాక్టికల్‌గా నడిచే యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, (మిగతా 6వ పేజీలో)

హెచ్‌సీయూ భూముల్లో జోక్యం తగదు

- ఖమ్మంలో వామపక్ష విద్యార్థి సంఘాల ర్యాలీ
- అరెస్టులకు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- కొత్తగూడెంలో సీపీఎం నాయకుల ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం/కొత్తగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ భూముల్ని అమ్మకం చేసేందుకు చూస్తోందని దానిని అడ్డుకున్నందుకు విద్యార్థి సంఘాల నాయకులపై దౌర్జన్యంగా అక్రమ కేసులు బనాయించారని వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు విమర్శించారు. హెచ్‌సీయూ భూముల్ని తిరిగి యూనివర్సిటీలకు కేటాయించాలని నినాదాలు చేస్తూ బుధవారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, మస్తాన్, మంద సురేశ్, శివ, మనోజ్‌రాజ్, అజయ్‌సాగర్, బాను, సాయి, వినోద్, ప్రతాపు, గణేష్, గోపీ పాల్గొన్నారు.

కొత్తగూడెంలో దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400ఎకరాల భూమిని వేలం ప్రక్రియ చేపట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు, సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం బస్టాండ్‌సెంటరులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేలం పాట వేసి భూములు అమ్మడం వల్ల పర్యావరణం దెబ్బతిని జీవవైవిధ్యం నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమి పరిరక్షణ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఆందోళన చేస్తున్న విద్యార్థులను వారికి మద్దతుగా నిలిచిన సీపీఎం నాయకులను ప్రభుత్వం నిరంకుశంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిందని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ 7వ గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉంటుందని చెప్పారని ఆందోళన చేస్తున్న విద్యార్థులు రాజకీయ పార్టీల నాయకులను అరెస్టు చేయడమేనా ఏడో గ్యారెంటీ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేలం ప్రక్రియ ద్వారా ఆ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలనే ప్రయత్నం చేస్తోందని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. వేలం ప్రక్రియ ద్వారా సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మాలనే ప్రభుత్వ విధానాలను వెనక్కి తీసుకోవాలని, విద్యార్థుల పోరాటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కే.బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, జిల్లాకమిటీ సభ్యుడు భూక్యా రమేష్, నాయకులు డి.వీరన్న, సందుకూరి లక్ష్మి, కే.సత్య, విజయగిరి శ్రీను, రాంచరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సన్నాల సంబురం



- జిల్లాలో బోనస్ చెల్లింపులు సంపూర్ణం

7



నెలాఖరు వరకు ఎల్‌ఆర్‌ఎస్ గడువు

- 25 శాతం రాయితీ వర్తింపు.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

7

ఆరంతస్తుల భవనం ఎలా కూలింది..?

- రెస్క్యూ ఆపరేషన్‌కు ఎంత సమయం పట్టింది...
- అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి
- సంఘటన స్థలం పరిశీలన
- ఆధునిక పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచన



భవనం కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీజీ నాగిరెడ్డి

భద్రాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఇటీవల జీ+5 బహుళ అంతస్తు భవనం కూలిన ఘటనపై రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి ఆరా తీశారు. బుధవారం భద్రాచలం వచ్చిన ఆయన బహుళ అంతస్తు భవనం కూలిన తీరును కారణాలను స్థానిక పోలీసు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖకు చెందిన తెలంగాణ డిజాస్టర్ రెస్క్యూఫోర్సు సహాయక చర్యల్లో చురుగ్గా వ్యవహరించిన తీరును అభినందించారు. ఈ సమయంలో రెస్క్యూ ఆపరేషన్ ఏవిధంగా చేశారు? ఏఏ అధునాతన పరికరాలను వినియోగించారు? రెస్క్యూ ఆపరేషన్ ఎన్ని గంటలు పట్టింది? తదితర వివరాలను జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో రెస్క్యూ ఆపరేషన్‌ను 36 గంటలు పట్టిందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో అధునాతన పరికరాలు ఇంకా ఏమైనా కావాలా అని డీజీ నాగిరెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిని అడిగారు. దీంతో హైడ్రాలిక్ కట్టర్స్ (మిగతా 6వ పేజీలో)

ఫేస్‌టుఫేస్



వడదెబ్బ బాధితులకు ఐదు పడకలు

- నిరాటంకంగా వైద్యసేవలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు

ప్రశ్న: వడదెబ్బ బాధితుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

జవాబు: జిల్లా నలుమూలల నుంచి వడదెబ్బ తగిలిన వారికి చికిత్సలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు పడకలను సిద్ధం చేశాం. వడదెబ్బకు గురైన వారికి ఇక్కడ చికిత్స అందించనున్నాం.

ప్ర: బాధితుల కోసం మందులు సిద్ధంగా ఉన్నాయి?

జ: ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు బాధితులకు అందించాల్సిన మందులు, సెలైన్ బాటిళ్లు సిద్ధంగా ఉన్నాయి.

ప్ర: క్యాజువాలిటీలో అత్యవసర సమయంలో వైద్యులు ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి?

జ: అదేం లేదు. క్యాజువాలిటీలో రెండు షిఫ్టుల్లో వైద్యులు ఉంటున్నారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వైద్యులను అందుబాటులో ఉంచుతున్నాం. ఎక్కడా అత్యవసర సేవలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్ర: వార్డుల్లో ఫ్యాన్లు పనిచేయక, వేడికి రోగులు ఇబ్బందులు పడుతున్నారు?

జ: వార్డుల్లో ఫ్యాన్లకు ఎలాంటి మరమ్మతులు లేవు. అన్ని పని చేస్తూనే ఉన్నాయి. అయితే వేసవి తీవ్రతను తట్టుకునేలా వార్డుల్లో కూలర్లు ఏర్పాటు చేస్తున్నాం. తక్షణమే ఎంసీహెచ్‌లో, వార్డుల్లో కూలర్లకు చిన్నచిన్న మరమ్మతులు చేపట్టి సిద్ధం చేస్తున్నాం.

ప్ర: ఐసీయూల్లోనూ ఏసీలు పనిచేయక రోగులు ఇక్కట్లు పడుతున్నారు?

జ: ఐసీయూల్లోనూ ఏసీలకు మరమ్మతులు చేపట్టాం. కొన్ని చోట్ల ఇబ్బందులున్నాయి. వాటిని గుర్తించి అక్కడ కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం.

ప్ర: ఎక్స్‌రే, ఈసీజీల వద్ద రోగులు వేచి ఉండాల్సిన పరిస్థితులుంటున్నాయి?

జ: ఎక్స్‌రేలు, ఈసీజీలు రెగ్యులర్‌గా ఉండవు. ఒక్కోసారి ఎక్కువ మంది వస్తున్నమాట వాస్తవమే. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తూనే ఉన్నాం. మిషన్లు ఒక్కోసారి పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులుంటున్నాయి తప్ప, మిగిలిన సమయంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

ప్ర: ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచినీటి సౌకర్యం ఇబ్బంది కలుగుతుంది కదా?

జ: దాదాపు ఫిల్టర్ వాటర్‌ను అందిస్తున్నాం. ఎంసీహెచ్‌లో, ఆస్పత్రి ఎదుట ఏర్పాటు చేసాం. మంచినీటికి ఇబ్బంది ఏమీ లేదు. వేసవి నేపథ్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బావుంటుంది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఏర్పాటు చేసేలా యోచిస్తాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

నాణ్యత, రుచిలో ఎలాం'టీ' లోటు లేదు

- చెల్లెమ్మ అంటూ కితాబిచ్చిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అప్పటి నుంచి ఇప్పటివరకు మీ టీలో నాణ్యత.. రుచిలో ఎలాంటి లోటు లేదమ్మా...? చెల్లెమ్మా మీ టీ బావుంది.. నిర్వహణ తీరు బావుంది అంటూ ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఓ క్యాంటీన్ నిర్వాహకురాలితో అన్న మాటలివి. ఖమ్మం కలెక్టరేట్ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన టీ క్యాంటిన్‌ను ఐదు నెలల క్రితం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. అప్పటినుంచి ఆ క్యాంటిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బుధవారం టీ క్యాంటిన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ టీ క్యాంటిన్ నిర్వాహకురాలితో సంభాషించారు. 'చెల్లెమ్మా నేను రోజు కలెక్టరేట్‌కు వస్తూ, పోతూ చూస్తున్నా.. జనం ఉంటున్నారు. వ్యాపారం మంచిగా నడుస్తుందా... వేసవి కాలం వచ్చింది కదా.. బటర్ మిల్క్, లెమన్ వాటర్, మిల్క్ షేక్, ఫల్లుదా, పండ్ల రసాలు వంటివి అమ్మవచ్చు కదా... ఆ దిశగా ఎందుకు పరిశీలించడం లేదు. పాల ఉత్పత్తులతో మంచి లస్సీ తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయి కదా.. ఆ దిశగా ఆలోచించమ్మా..' అంటూ కలెక్టర్ సలహా ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన తినుబండారాలు విక్రయిస్తే ఆదరణతోపాటు లాభాలు వస్తాయని అన్నారు. అంతే కాదు ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని సూచించారు. మీలాంటి వాళ్లు మీరు ఉపాధి పొందడమే కాదు.. పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



టీ క్యాంటిన్ మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, టీ తాగుతూ..

సర్వాంగ సుందరంగా గిరిజన మ్యూజియం

- 6న ప్రారంభోత్సవం
- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



సమీక్ష నిర్వహిస్తున్న పీవో

భద్రాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) ఐటీడీఏ ప్రాంగణంలో సర్వ సుందరంగా అలంకరించిన గిరిజన మ్యూజియంను ఈ నెల 6న ప్రారంభించేందుకు సిద్ధం చేశామని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి గిరిజన మ్యూజియంలో యూనిట్ అధికారులతో పీవో సమీక్ష నిర్వహించారు. మ్యూజియంలో ఇంకా ఏమైనా మిగిలి ఉన్న పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని జీసీసీ, అగ్రికల్చర్ సంబంధించిన ఉత్పత్తులను ప్రారంభించే రోజే మ్యూజియంలో ఏర్పాటు చేసి వాటి వివరాలు సందర్శకులకు అర్థమయ్యే రీతిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, ఏవో సున్నం రాంబాబు పాల్గొన్నారు.

మోరంపల్లిబంజర సంత వేలం రూ.33.5 లక్షలు పలికిన ధర

బూర్గంపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే సంత బహిరంగ వేలాన్ని బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. డీఎల్‌పీవో సుధీర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ వేలంలో ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. ప్రతి గురు, శుక్రవారం నిర్వహించే పశువులు, కూరగాయల సంతను టేకులపల్లికి చెందిన బాణోత్ రవీందర్ అనే వ్యక్తి రూ.33.50లక్షలకు దక్కించుకున్నాడు. గ్రామ పంచాయతీ పరిధిలోని బందెలదొడ్డికి వేలం నిర్వహించగా మర్రికుంట గ్రామానికి పోడియం వేణు అనే వ్యక్తి రూ.3,500లకు దక్కించుకున్నాడు. అలాగే బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి బుధవారం నిర్వహించే సంత వేలాన్ని సారపాకకు చెందిన జక్కం శ్రీనివాసరావు అనే వ్యక్తి రూ.2.54లక్షలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీవో బాలయ్య, కార్యదర్శులు భవానీ, వెంకటనాగిరెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కోనేరు చిన్ని

చుంచుపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ సంస్థలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్ని) అన్నారు. బుధవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్దాల మీద బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని ప్రభుత్వం లాగేసుకుంటున్నట్టు దుష్ప్రచారం జరుగుతోందని, వాస్తవాలు ప్రజలకు తెలియాలని స్పష్టం చేశారు. 2004లో 400 కరాలను ఐఎంజీ భారత్‌కు అప్పటి ప్రభుత్వం అప్పగించిందని, దానికి బదులుగా అప్పటి ప్రభుత్వం గోపన్‌పల్లిలోని 397ఎకరాలు హెచ్‌సీయూకి ఇచ్చిందని గుర్తు చేశారు. బిల్లీ రావుకు చెందిన ఐఎంజీ భారత్ అనే కంపెనీకి ఇచ్చిన భూ ఒప్పందాన్ని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఆ సంస్థ కోర్టుకు వెళ్లగా ప్రజల ఆస్తి ప్రజలకే ఉండాలని ప్రభుత్వం పోరాటం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొట్లాడి కేసు గెలిచిందని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రౌడీలు ఎవరో తెలుసని, అవినీతి, అక్రమాలకు పాల్పడింది ప్రజలకు తెలుసని ఎద్దేవ చేశారు. దళితబంధు పేరిట రాంబంధువుగా మారి అమాయక దళిత ప్రజలను మోసం చేసిన చరిత్ర మీదని విమర్శించారు. కొడుకు అక్రమాలకు కుటుంబాలే బలయ్యాయని, కాంగ్రెస్ భిక్షతోనే నేడు ఈ స్థాయిలో ఉన్నారని మరవకూడదని హితవు పలికారు. సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవిప్రసన్న, రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, నాయకులు మండే హనుమంతరావు, సత్యనారాయణరెడ్డి, సుందర్‌రాజు, రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కోనేరు చిన్ని

భగవద్గీత పఠనంలో సామ్రాజ్యానికి గోల్డ్ మెడల్

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణానికి చెందిన ధరావత్ సామ్రాజ్యం భగవద్గీత కంఠోపఠనంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీగణపతి సచ్చిదానందస్వామిచే సామ్రాజ్యం గోల్డ్‌మెడల్ అందుకున్నారు. శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము మైసూరు వారు గత మార్చి 9న నిర్వహించిన ప్రతిభ పాటవ కార్యక్రమంలో సామ్రాజ్యం భగవద్గీత పారాయణము 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు కంఠస్థము, ఉచ్చరణలో తమ ప్రతిభను కనబరిచారు. పై విధంగా భగవద్గీత కంఠోపఠనంలో సామ్రాజ్యం ఉత్తమ ప్రతిభను కబరిచినందుకుగాను సదరు ఆశ్రమము వారు ప్రత్యేకంగా అభినందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా సామ్రాజ్యం మాట్లాడుతూ భగవద్గీత కంఠోపఠనంలో తాను ఏకాగ్రత కలిగి ఉండి ఆధ్యాత్మికతను పాటించటంతో శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమముచే గోల్డ్ మెడల్ సాధించానని చెప్పారు.



గోల్డ్ మెడల్ అందుకున్న ధరావత్ సామ్రాజ్యం

భద్రాచలం అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలి

భద్రాచలం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):భద్రాచలం అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఒక రోజు దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భద్రాచలం పట్ల కక్షపూరిత ధోరణితో ఉందని పదేళ్ల క్రితం పోలవరం ప్రాజెక్టు పేరుతో భద్రాచలం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను ఆంధ్రాలో కలిపి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ముంపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సర్వే మరోసారి నిర్వహించాలని కోరారు. అలాగే సుభాష్‌నగర్ వైపు కరకట్ట పొడిగింపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, శరత్‌బాబు, సంతోష్, సీతాలక్ష్మి, లీలావతి, జ్యోతి, ఫిరోజ్, జీవనజ్యోతి, శ్రీనివాస్, మాధవరావు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

దళిత బంధువు 'వల్లభి' రామయ్య

- శ్రీరాముడిని గుండెల్లో పెట్టుకున్న దళిత కుటుంబాలు
- అగ్రవర్ణాల వివక్ష భరించలేక ఆలయ నిర్మాణం
- 90 ఏళ్లుగా దళితులే పూజారులుగా ధూపదీప నైవేద్యాలు

ముదిగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక కట్టుబాట్లు కఠినంగా ఉన్న రోజుల్లో దళితులకు ఆలయ ప్రవేశంపై తీవ్ర వివక్ష ఉండేది. అలాంటి రోజుల్లో దళితులు శ్రీరామచంద్రస్వామిని తమ గుండెల్లో పెట్టుకొని ఆలయాన్నే నిర్మించారు. ఆ ఆలయానికి 90ఏళ్లుగా దళితులే పూజారులుగా కొనసాగుతుండడం విశేషం. ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామంలోని రామాలయంలో స్వామివారికి దళితులే నిత్య పూజలు నిర్వహిస్తుండగా.. కులమతాలకు అతీతంగా ప్రజలు స్వామివారిని దర్శించుకొని తరిస్తున్నారు.

కొన్నేళ్ల క్రితం వల్లభి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు జరుగుతుండగా కొందరు దళితులు గోడపై నుంచి చూస్తుండగా గ్రామపెద్దలు వారిని అవమానించారు. ఈ విషయాన్ని ఆత్మగౌరవ సమస్యగా భావించిన దళితులు గ్రామంలో రామాలయ నిర్మాణాన్ని చేపట్టారు. దళితవాడలో సద్గురు బోధానంద బోధనల ప్రభావంతో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్న వంగూరి రామస్వామి అనే దళితుడు ఆ ఆలయ తొలిపూజారిగా బాధ్యతలు స్వీకరించారు. మొదట రాములవారి చిత్రపటానికి నిత్య పూజలు నిర్వహించేవారు. ఈ క్రమంలో ఆలయంలో పూజలు చేస్తున్న దళితులను అగ్రకులాల వారు హేళన చేసేవారు. దీంతో అగ్రకులాలు, దళితుల నడుమ వివాదం రగిలింది. అప్పటికే రామాలయ నిర్మాణం పేరుతో ఆత్మగౌరవ జెండాను ఎగురవేసిన దళితులు అగ్రకులాలు రెండు వర్గాలుగా విడిపోయారు. కొన్ని సందర్భాల్లో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడి గ్రామాన్ని వదిలిపెట్టాల్సి వచ్చింది.

ఈ విషయం తెలుసుకున్న గాంధేయవాది బన్సాలీ వల్లభి గ్రామానికి విచ్చేసి దళితులు నిర్మించిన ఆలయంలోనే దీక్షకు పూనుకున్నారు. ఈ వార్త బాహ్య ప్రపంచానికి తెలియడంతో ఆనాటి ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య రాజీ కుదర్చడంతో బన్సాలీ దీక్ష విరమించారు. ఆనాటి నుంచి తమ కుటుంబ బాగోగుల కంటే మిన్నగా రాముడే తమ శ్వాసగా వంగూరి రామస్వామి కుటుంబం జీవించింది. ఎంత కష్టమైనా, తాము తిన్నా తినకపోయినా రామయ్యకు నిత్య పూజలు చేయడాన్ని ఆనవాయితీగా మార్చుకున్నారు.

ఆలయ తొలినాళ్ల పూజారి వంగూరి రామస్వామి మరణం అనంతరం ఆయన కుమారుడు ముత్తయ్య పూజారిగా బాధ్యతలు నిర్వహించారు. 2021లో ముత్తయ్య అనారోగ్యంతో మరణించడంతో ఆయన మనుమడు అనంతరాములు ప్రస్తుతం ఆలయ పూజారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తొలినాళ్లలో నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.40లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ ఆలయంలో ప్రతి శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలకు కులమతాలకతీతంగా భక్తులు పాల్గొంటారు.



స్వామివారికి పూజలు చేస్తున్న పూజారి అనంతరాములు

ఆరంతస్తుల భవనం ఎలా కూలింది..?

(5వ పేజీ తరువాయి)

విక్టిమ్ లోకేషన్ సిస్టం ఇతర అధునాతన పరికరాలు అవసరమని ఆయన డీజీ దృష్టికి తేగా ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించారు. అనంతరం భద్రాచలం అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్, భద్రాచలం ఏఎస్‌పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీజీ

సీఎంవోగా కిరణ్‌రాజ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రధాన ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారిగా నియమితులైన డాక్టర్ ఆర్. కిరణ్ రాజ్‌కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కిరణ్‌బాబును సింగరేణి వైద్యాధికారులు సత్కరించారు. అడిషనల్ సీఎంవో డాక్టర్ ఉషా, డీవైసీఎంవో డాక్టర్ సునీలాతోపాటు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

కార్మికసంఘాల నాయకులు సైతం పూలమాలలతో సత్కరించారు. ఏఐటీయూసీ నాయకులు వీరస్వామి, సుధాకర్, శేషగిరి రావు, హీరాలాల్, ఆర్‌కే. ప్రసాద్, మధుకృష్ణలు సీఎంవోను సత్కరించారు.

రేషన్ షాపులు సక్రమంగా నిర్వహించాలి

(5వ పేజీ తరువాయి)

స్థానిక మార్కెట్ పరిస్థితులపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. అవసరమైతే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి యూనిట్‌ను సంబంధిత అధికారులు పర్యవేక్షించి ధ్రువీకరణ చేయాల్సి ఉంటుందన్నారు 14వ తేదీ తరువాత మండల, జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాలతో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని, జూన్‌లో యూనిట్లు మంజూరు చేస్తామని తెలిపారు.

అలాగే ఖమ్మంలో ఏర్పాటు చేయబోతున్న మహిళ మార్టుకు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళ మార్టులో జిల్లాలో మహిళలు చేస్తున్న ఉత్పత్తులను ఇక్కడ ఉంచుతామని, ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానం కూడా ప్రోత్సహిస్తామని తెలిపారు. మహిళ మార్టులో రేషన్‌షాపు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, డీఆర్డీవో సన్యాసయ్య, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, మైనారిటీ సంక్షేమాధికారి పురంధర్, గిరిజన సంక్షేమాధికారి విజయలక్ష్మి, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి గాయాలు

మణుగూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని రామానుంజవరం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ రెవెన్యూ ఉద్యోగికి గాయాలయ్యాయి. పినపాక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే నాగరాణి పినపాక నుంచి ద్విచక్రవాహనంపై మణుగూరు వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో ఆమెకు గాయాలుకాగా స్థానికులు మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భక్తులకు సకల ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఉంచడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు వైద్య శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు.

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం శ్రీరామనవమి కల్యాణాన్ని తిలకించేందుకు ఆన్‌లైన్‌లో 75శాతం టికెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తలంబ్రాల కౌంటర్లు 80, లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్లు 26 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సీఎం రాక కోసం మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని 25పాయింట్లలో తాగునీటి సౌకర్యంతోపాటు 15 చోట్ల 162 టాయిలెట్లు, మూడు మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 565 మంది సిబ్బంది అందుబాటులో ఉంచామని తెలిపారు. భక్తులు గోదావరి లోపలికి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశామని, లైఫ్ జాకెట్లు, లైఫ్‌బౌల్సు 15 రెస్క్యూ బోట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 13 ప్రథమ చికిత్స కేంద్రాలు, ఐదు అంబులెన్సులు, 30మంది ఫీల్డ్ స్టాఫ్, ఏరియా వైద్యశాలలో ప్రత్యేక ఐసీయూ వార్డు 24గంటలు పని చేసేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ సమీక్షలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏఎస్‌పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతకుముందు దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌ను కలెక్టర్ జితేష్‌వి పాటిల్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.



రామాలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ దంపతులు

భద్రక మండల లేఖనం ఆరాధన

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త తిరు కల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రామాలయంలోని యాగశాలలో భద్రక మండల లేఖనం ఆరాధన నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ద్వారతోరణ పూజ, సంక్షేపరామాయణ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకుడు పొడిచేటి రామభద్రాచార్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, దేవనాద జీయర్‌స్వామి దర్శించుకున్నారు.

ఆరు నెలలుగా అదే తీరు...

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ కోసం ఆదివాసీల పాట్లు

దుమ్ముగూడెం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అన్ని నెట్‌వర్క్ ధరలతో పోలిస్తే తక్కువ ...పైగా ప్రభుత్వ రంగ సంస్థ...ఊరి దగ్గరలోనే సెల్ టవర్....బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణంతో మొబైల్ సిగ్నల్ ఇబ్బందులు తొలగడంతోపాటు, లాభసాటిగా ఉంటుందనుకున్న మారుమూల అటవీ ప్రాంత చింతగుప్ప ఆదివాసీలకు తాము ఊహించిందంతా ఎడారిలో ఎండమావులని తెలుసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు. గత తప్పులను సరిదిద్దుకొని ప్రైవేటు రంగంతో పోటీ పడాల్సిన బీఎస్ఎన్ఎల్ సంస్థ మరోమారు అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందనే ఆరోపణలున్నాయి. మండలంలోని మారుమూల ప్రాంతం చింతగుప్పలో సోలార్ విధానంలో ఏడాది క్రితం నిర్మించిన బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యతో పరిసర గ్రామాల ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. చింతగుప్పతోపాటు మరి కొన్ని గ్రామాల ప్రజలు ప్రైవేటు నెట్‌వర్క్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ వాయిస్ కాల్, ఇంటర్‌నెట్ సేవలు మెరుగుపడలేదు. ఫోనులో సంభాషణ జరుగుతుండగానే మాట కట్ అయి పోవడం, ఎదుటి వాళ్ల మాట్లాడింది వినబడకపోవడం వంటి సమస్యలను తరచూ ఎదుర్కొంటున్నారు. గతంలోనూ బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఈ సమస్యను వివరించినప్పటికీ, పరిష్కారం దొరకలేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరలా ప్రైవేటు నెట్‌వర్క్‌కు వెళ్లాలా లేక బీఎస్ఎన్ఎల్‌లోనే ఉండాలా అనే విషయం తేల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నారు. మా దగ్గర బీఎస్ఎన్ఎల్ టవర్ పెట్టారని ఆరు నెలల క్రితం నెట్‌వర్క్‌కు మారాం. అప్పటి నుంచి సరిగా డేటా రాదు...

ఏఈ ఏమంటున్నారంటే

చింతగుప్ప బీఎస్ఎన్ఎల్ టవర్‌కు సంబంధించి కొన్ని సమస్యలున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఏఈ మదన్‌గోపాల్ తెలిపారు. టవర్ పనితీరును పరిశీలించడానికి టెక్నికల్ టీమును పంపుతానన్నారు. ప్రస్తుతం వారు వేరే చోట పనిచేస్తున్నారని, వీలైనంత త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సన్నాల సంబురం



▸ ఖమ్మం జిల్లాలో బోనస్ చెల్లింపులు సంపూర్ణం

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలో సన్నరకం ధాన్యానికి బోనస్ సొమ్ము చెల్లింపులు సంపూర్ణంగా పూర్తయ్యాయి. కేవలం ఒకే ఒక్క రైతుకు మాత్రమే బోనస్ సొమ్ము ప్రభుత్వం నుంచి పెండింగ్ ఉంది. అది మినహాయించి మిగిలిన రైతులందరికి బుధవారం నాటికి బోనస్ సొమ్మును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. 47,494మంది రైతులకు రూ.136కోట్ల, 33లక్షల, 30వేల బోనస్‌ను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఇంకా కేవలం ఎర్రుపాలెం మండలంలోని ఒక్క రైతుకు మాత్రమే రూ.32వేల బోనస్‌ను చెల్లించాల్సి ఉంది. గత ఏడాది ఖరీఫ్‌లో ప్రభుత్వం అన్ని ఏజన్సీల ద్వారా 27,26,660క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని 47,495మంది రైతుల నుంచి కొనుగోలు చేసింది. మొత్తానికి రూ.136కోట్ల, 33లక్షల, 62వేల బోనస్‌ను చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు 47,494 మంది రైతులకు పై మొత్తాన్ని ఖాతాల్లో జమచేశారు.

రైతుల్లో హర్షాతిరేఖాలు...

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి డిసెంబరులో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లోనే ప్రకటించింది. ఆ హామీ మేరకు సన్నరకం ధాన్యం పండించిన రైతులకు బోనస్ లాభం దక్కింది. క్వింటా ఏగ్రేడ్ రకానికి రూ.2320తోపాటు ప్రభుత్వం రూ.500బోనస్ ఇవ్వడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. క్వింటా ఒక్కంటికి రూ.2820చొప్పున రైతులకు లభించింది. సహకార సంఘాల ద్వారా రూ.162కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ద్వారా 151, డీసీఎంఎస్ ద్వారా 28, మెప్మా ద్వారా మూడు మొత్తం 334 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సీజన్ ప్రారంభంలో ధాన్యం కొనుగోళ్లలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఆతర్వాత అధికారులు మిల్లుల సంఖ్యను పెంచటం, నిబంధనలను సడలించడంతో కొనుగోళ్లలో వేగం పుంజుకుంది. అయితే ఈ సన్నరకం ధాన్యానికి డిసెంబరులో కొనుగోళ్లు ప్రారంభమైన వెంటనే అసలు సొమ్ముతోపాటు రూ.500బోనస్ కూడా ఒకట్రెండురోజుల్లోనే చెల్లించారు.

అయితే కొద్దిరోజుల తర్వాత బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరగడంతో రైతుల్లో అనేక అనుమానాలు తలెత్తి వారిలో అసంతృప్తికి దారితీసింది. చివరికి ఫిబ్రవరి రెండోవారం నుంచి విడతల వారీగా బోనస్ సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేశారు. చివరికి బుధవారంతో ఈ చెల్లింపులు సంపూర్ణమయ్యాయి. ఎర్రుపాలెం మండలంలోని ఒక్క రైతుకు మాత్రమే రూ.32వేల బోనస్‌ను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. రైతుభరోసా, రుణమాఫీ అందక కొంత అసంతృప్తితో ఉన్న ధాన్యం రైతులు మాత్రం బోనస్ సొమ్ము రాకతో సంతోషం వ్యక్తం చేశారు.

నాడు పంచాహ్నికం..

నేడు నవాహ్నికం



సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

భద్రాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దశాబ్దాల తరబడి శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నవాహ్నికంగా నిర్వహిస్తున్నారు. భద్రాద్రి రామక్షేత్రంలో పాంచరాత్రగమ శాస్త్రోక్తంగా కల్యాణంను కన్నుల పండువగా తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తారు. ఆరంభంలో 1935-45 ల్లో సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించడంతో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలుగా పేర్కొనేవారు. అనంతరం 1950 తరువాత కల్యాణ మహోత్సవంలో మార్పులు చేసి ఏడు రోజుల పాటు నిర్వహించేవారు. దీంతో వీటిని సప్తాహ్నిక బ్ర హ్మోత్సవాలని పేరు. కాల క్రమంలో మార్పు లు జరుగుతూ ప్రస్తుతం తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం జరుగుతుండటంతో నవాహ్నిక మహోత్సవాలుగా పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి నవాహ్నిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

మూడో వేదికగా మిథిలా స్టేడియం

స్వామి వారి కల్యాణాన్ని భక్తరామదాసుగా ప్రసిద్ధిగాంచిన కంచర్ల గోపన్న హయాంలో ఆలయంలో ఉన్న యాగశాలపై ఉండే మండపంలో నిర్వహించే వారు. అనంతరం ప్రస్తుతం ఉన్న చిత్రకూట మండపం స్థానంలో ఉన్న మండపంపై నిర్వహించేవారు. అయితే ఆలయంలో కల్యాణం నిర్వహించడంతో భక్తుల రద్దీ కారణంగా ఆలయం ఉత్తరం వైపున కొత్తగా కల్యాణ మండపాన్ని 1964లో నిర్మించారు. అప్పటి నుంచి ఏటా స్వామి వారి కల్యాణాన్ని ఇక్కడే నిర్వహిస్తున్నారు. 1987లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో మహాసామ్రాజ్య పట్టాభిషేకాన్ని పురస్కరించుకొని మిథిలా స్టేడియాన్ని నిర్మించారు. అనంతరం 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పై భాగంలో భక్తులు రామయ్య దర్శనం ఉచితంగా వీక్షించేందుకు గాల్వాలియం షీట్లను ఏర్పాటు చేసేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో నాటి నుంచి భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు మార్గం సుగుమం అయ్యింది.

రేపటి నుంచి నవాహ్నిక మహోత్సవాలు

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నవాహ్నిక మహోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణంతో అస లు ఉత్సవం ప్రారంభమవుతుందని వైదిక సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ నెల 5న ఎదుర్కోలు, 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారాముల తిరుకల్యాణ మహోత్సవం, సాయంత్రం శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభం కానుంది. 7న మహాపట్టాభిషేకం రథోత్సవం నిర్వహించనున్నారు. 8న సదస్యం, 9న తెప్పోత్సవం, 10న ఊంజల్‌సేవ, 11న వసంతోత్సవం, 12న చక్రతీర్థం, పూర్ణాహుతి శేషవాహన సేవ,ధ్వజ అవరోహణం, ద్వాదశ ఆరాధనలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

కొనసాగుతున్న నవమి పనులు



భద్రాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని నవమి వేడుకలకు ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం 6న మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న తరుణంలో ఇందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. మిథిలా స్టేడియంలో 26 సెక్టార్లలో 250 ఫ్యాన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా దేవస్థానం పరిధిలోని రంగనాయకుల గుట్టపై ఉన్న కాటేజీలు, శ్రీరామనిలయంలో అవసరమైన చోట పరుపులను వేసేందుకు దేవస్థానం అధికారులు కొనుగోలు చేయగా అవి బుధవారం భద్రాచలం చేరుకున్నాయి. ఇదిలా ఉండగా దేవస్థానం పరిధిలో పని చేస్తున్న పలువురు సిబ్బంది అంతర్గత మార్పులను అత్యవసరంగా చేసినట్లు తెలుస్తోంది.

తలంబ్రాలు, లడ్డూ కౌంటర్ల పెంపు....

నవమి నాడు సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు పంపిణీ చేసేందుకు తలంబ్రాల కౌంటర్లు దేవస్థానం అధికారులు పెంచారు. రెండు రోజుల క్రితం దేవాదాయ శాఖ కమీషనర్ ఈ.శ్రీధర్ ప్రస్తుతం ఉన్న కౌంటర్ల సంఖ్యను మరింతగా పెంచాలని ఆదేశించిన క్రమంలో దేవస్థానం అధికారులకు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. 60 కౌంటర్లు తొలుత ఏర్పాటు చేయాలని నిర్ణయించగా అదనంగా మరో 20 కౌంటర్ల ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మొత్తం తలంబ్రాల పంపిణీ కోసం 80 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అయ్యింది. అదేవిధంగా లడ్డూ ప్రసాద విక్రయాలకు 19 కౌంటర్లను గతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించగా తాజాగా అదనంగా మరో ఏడు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మొత్తం 26 కౌంటర్లు లడ్డూ ప్రసాద విక్రయాల కోసం ఏర్పాటు చేసినట్లు అయ్యింది.

సార్వభౌమ వాహనంలో రామయ్యకు సేవ...

భద్రాచలంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సార్వభౌమ వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక శాతం మంది భక్తులు రామయ్యను దర్శించి తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ముదిగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లాపురం మున్నేరు నదిలో గుర్తుతెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఖమ్మం అన్నం పౌండేషన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీకి తరలించినట్లు సీఐ మురళీ తెలిపారు. మృతుడు నేవీబ్లూకలర్ ప్యాంటు, నలుపు రంగు చొక్కా ధరించాడని సీఐ తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు



గుడుంబాను పారబోస్తున్న పోలీసులు

పినపాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగినేపల్లి, చెగర్శల అటవీ ప్రాంతంలో నిర్వహించిన గుడుంబా స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహిం చారు. మణుగూరు ఎక్సైజ్‌శాఖ సీఐ రాజీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో నిల్వ ఉంచిన 500లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రాపర్తినగర్‌కు చెందిన పెడగొట్టు హనుమంతుకి చెల్లని చెక్కు కేసులో 6 నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి నష్ట పరిహారం కింద రూ.4లక్షల 50వేల చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు.. ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురానికి చెందిన బత్తినేని రేణుక వద్ద పెడగొట్టు హనుమంతు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2018లో రూ.4లక్షలు అప్పుగా తీసుకొని, అదే రోజు ప్రాంసరీనోటు ఇచ్చినాడు. తన రుణం తిరిగి చెల్లించమని అతడిని అడగగా 2019లో రూ.4లక్షల50వేలకు చెక్కు ఇచ్చాడు. అట్టి చెక్కును తన బ్యాంకు ఖాతాలో చెక్కు జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైనది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

ట్రాక్టరు బోల్తా పడి రైతు మృతి



వెంకటకృష్ణారెడ్డి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ముట్లవాగు వంతెన సమీపాన సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురానికి చెందిన రైతు పడిగపాటి వెంకటకృష్ణారెడ్డి(39) బుధవారం ఉదయం తన పత్తి చేలో మోడు లాగేందుకు ట్రాక్టర్‌పైన బయల్దేరాడు. బండారుగూడెం-వైట్‌నాగారంల మధ్య ముట్లవాగు వంతెన సమీపాన ట్రాక్టరును అదుపు చేయలేక రోడ్డుకు ఎడమ వైపు ఉన్న కాలువలో ట్రాక్టర్‌తో సహా పడిపోయాడు. ట్రాక్టరు ఒక్కసారిగా మీదపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోటు గణేష్ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు..

కొణిజర్ల, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): కల్లు గీసేందుకు తాటుచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి కల్లుగీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొండవనమాలగ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన తీగల సత్యం(57) కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమదవశాత్తు కాలుజారి చెట్టు పై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య తీగల స్వరూప బుధవారం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు.

ఆంధ్రాలోని పోలవరం ప్రాంతం నుంచి అశ్వారావుపేటకు 15టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దులో దాడులు నిర్వహించి ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. లారీని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఇసుకను తరలిస్తున్న ఆంధ్రాలోని ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసీమకు చెందిన గంటా కొండబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యం భేష్

పాఠశాల విద్య అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి బాయి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం చాలా బాగుందని పాఠశాల విద్య అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి అన్నారు. పదవ తరగతి పరీక్షల ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ కూడా అయిన విజయలక్ష్మీబాయి తొలుత నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేసారు. అనంతరం సింగారెడ్డిపాలెం పాఠశాలలోని ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), ఏఐ కార్యక్రమాలను పరిశీలించారు. 1,3,4వ తరగతులను పరిశీలించారు. ఆయా తరగతుల్లోని విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఎస్ఏఏడీ అడిగిన అన్ని ప్రశ్నలకు విద్యార్థులు తడుముకోకుండా సమాధానాలు చెప్పారు.

ఏఐ తరగతుల విద్యార్థుల సామర్థ్యాన్ని సైతం పరీక్షించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సింగారెడ్డిపాలెం పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు తామేమీ తీసిపోమన్న విధంగా ఇక్కడి విద్యార్థుల సామర్థ్యం ఉందని అన్నారు. ఇందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు అసిస్టెంట్ డైరెక్టర్ వెంట ఉన్నారు.

ఇసుక ర్యాంపు నిర్వహణలో అవకతవకలు

మణుగూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మగూడెం ఇసుక ర్యాంపు నిర్వహణలో అవకతవకలు చోటు చేసుకున్నాయని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. బుధవారం స్నేహ గార్డెన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి పద్మగూడెం ఇసుక ర్యాంపులో చోటు చేసుకుంటున్న అక్రమాలు, అవకతవకలు పై అనేక అంశాలను సభ్యులు సుశీల సంధ్య, నర్సమ్మ తదితరులు పేర్కోన్నారు. పెద్దమ్మ తల్లి ట్రైబల్ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు పరస్పర సహకార సంఘం పేరిట సొసైటీని మూడు గ్రామాల పేరుతో ఏర్పాటు చేశారన్నారు. పద్మగూడెం, కొత్తకొండాపురం, కొమ్ముగూడెం గ్రామాలకు చెందిన 142 మంది సభ్యులు ఈ సొసైటీని రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. కాగా ఇంతమంది సభ్యుల సమ్మతం లేకుండా కేవలం ఐదుగురు కొమ్ముగూడెం, కొండాపురం గ్రామాలకు చెందిన ఐదుగురు సభ్యులు సొసైటీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నూతన కమిటీకి ఇసుక ర్యాంపుల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని కోరారు.అధికారులు స్పందించపోతే ఓ ట్రాక్టర్ ఇసుకను కూడా బయటికి వెళ్లకుండా అడ్డుకుంటామన్నారు.

నెలాఖరు వరకు ఎల్ఆర్ఎస్ గడువు

25 శాతం రాయితీ వర్తింపు.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఈనెల చివరి వరకు గడువు పెంచుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఆర్థిక భారం తగ్గించేందుకు గత నెలలో 25శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. రాయితీ గడువు తక్కువగా ఉండటంతో పాటుగా సర్వర్ సాంకేతిక సమస్యలు అధికంగా వచ్చాయి. మార్చి 29 నుంచి 31 వరకు ఆన్‌లైన్ సాంకేతిక ఇబ్బందులతో పాటుగా ఆర్థిక వార్షిక లెక్కల కారణాలతో బ్యాంకులకు సెలవ్‌లు రావటంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు తమ ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ చేసుకోలేక పోయారు. వేలాదిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఈనెల 30వ తేది వరకు 25శాతం రాయితీని కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు లైన్ క్లియర్ జరిగింది.

ప్రాంతాల వారీగా..

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 21,712 ఎల్ఆర్ఎస్ ఫీజుకు అర్హత పొందగా గత నెల 31 వరకు 7,071 ఎల్ఆర్ఎస్ ఫీజు పేమెంట్స్ చేసుకొని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేసుకున్నారు.

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో 3,115 ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు అర్హత పొందగా వారిలో 492 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఇంకా 2,623 మంది ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాల్సి ఉంది.

మధిర మున్సిపాలిటీలో మొత్తం 3,744 మందికి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు అర్హత పొందారు వారిలో 602 మంది ఫీజులు చెల్లించారు. ఇంకా 3,142 మంది ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

వైరా మున్సిపాలిటీలో 3,125 మంది ఎల్ఆర్ఎస్ ఫీజుకు చెల్లించాల్సి ఉండగా 400 దరఖాస్తులు చెల్లింపులు జరిగాయి. 2,725 పెండింగ్‌లో ఉన్నాయి.

ఏదులాపురం మున్సిపాలిటీలో 3,115 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఫీజు అర్హత పొందాయి. 492 ఫీజులు చెల్లించారు. ఇంకా 623 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

సుడా పరిధిలో 19,482 దరఖాస్తులు ఫీజు చెల్లింపులకు అర్హత పొందగా 4,664 దరఖాస్తులు మాత్రమే ఫీజులు చెల్లింపులు జరిగాయి. మరో 14,818 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు ఫీజులు చెల్లించాల్సి ఉంది.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ పరీక్షల ప్రారంభం

4 కేంద్రాలలో మొదటి రోజు 944 మంది హాజరు



విద్యార్థినిని పరిశీలిస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్, రెండో విడత 2025 పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్. పార్వతీ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి ఖమ్మం జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలలో మొత్తం 10,32 మంది విద్యార్థులకు గాను 944 మంది విద్యార్థులు పరీక్షకు హజరై, 88 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు బొమ్మా ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 130 మందికి, 112 మంది హజరై, 18 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 130 మందికి, 119 మంది హజరు కాగా, 11 మంది గైర్హాజరు, విజయ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఉదయం జరగిన పరీక్షకు 66 మందికి, 59 మంది పరీక్షకు హజరై, 7గురు గైర్హాజరు, మధ్యాహ్నం నరిగిన పరీక్షకు 97 మందికి, 84 మంది హజరై, 13 మంది గైర్హాజరు, ఎస్‌బిఐటిలో ఉదయం పరీక్షకు 102 మందికి 98 మంది పరీక్షకు హజరై, 4గురు గైర్హాజరు, మధ్యాహ్నం పరీక్షకు 107 మందికి, 99 మంది హజరై, 8 మంది గైర్హాజరు, , శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉదయం పరీక్షకు 200 మందికి, 185 మంది హజరై, 15 మంది గైర్హాజరు, మధ్యాహ్న పరీక్షకు 200 మందికి, 188 మంది హజరై, 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల గేట్లు ఉదయం 8:30 గంటలకు, మధ్యాహ్నం 2:30 గంటలకు మూసివేశారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లితండ్రులతో కోలాహలంగా మారింది. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు కోఆర్డినేటర్ తెలిపారు.

సోషల్ మీడియాలో బెదిరించారని ఫిర్యాదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ అజయ్‌బాబు అనే వ్యక్తిని సోషల్ మీడియా వేదికగా బెదించారని ఫిర్యాదు రావటంతో కేసు నమోదుచేసినట్లు ఖానాపురం హవేలి సీఐ భానుప్రకాష్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా పాస్టర్ అజయ్‌బాబుపై కొంతమంది కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తూ పలు రకాలుగా బెదిరిస్తున్నారని అజయ్‌బాబుకి సంబంధించిన పలువురు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లిఫ్టు ప్రమాదంపై విచారణ

ఖమ్మంక్రైం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖమ్మంనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరిగిన లిఫ్టు ప్రమాదంపై ఖమ్మం టుటౌన్ పోలీసులు కేసు నమోదుచేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా సీఐ బాలకృష్ణ విచారణ ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌కు ఓ లేఖ కూడా రాశారు. బిల్డింగ్ అనుమతులు నివాసం నిమిత్తం తీసుకున్నారా, వ్యాపార నిమిత్తం తీసుకున్నారా, అసలు బిల్డింగ్ నిర్మాణం కార్పొరేషన్‌కు అనుగుణంగా అనుమతులున్నాయా లేవా, బిల్డింగ్ ఉన్న ప్రాంతం ఆసుపత్రి నిర్వహించవచ్చు లేదా అన్న దానిపై అనుమతులు ఉన్నాయనే దానిపై తెలపాలని మునిసిపల్ కమిషనర్‌కు రాసిన లేఖలో సీఐ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయం నుండి వచ్చిన వివరణ ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అశ్వారావుపేట లోని పూజ్యశ్రీ మాధవన్‌జీ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. లోరా అనూష తెలిపారు. బుధవారం ఆ మె విలేకర్లతో మాట్లాడుతూ ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించు ఈ కోర్సుకు ఈనెల 23 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై, టీజీ పాలిసెట్ రాసి ర్యాంకు పొంది ఉండాలని వివరించారు. ఈ డిప్లొమా కోర్సు రెండు సంవత్సరాల కాల వ్యవధి ఉంటుందని, మొదటి సంవత్సరం ప్రవేశానికి 60 సీట్లు అశ్వారావుపేట కళాశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయం పట్ల ఆసక్తి ఉండి ప్రైవేటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనుకునేవారు, వ్యవసాయ ఆధారిత వ్యాపారం అభివృద్ధిచేసుకోవాలనే ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆమె కోరారు.

శ్రీవారి పాదానికి అష్టోత్తర కలశాభిషేకం



కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు నాలగవరోజు చేరాయి. తెల్లవారుజామున ప్రాతఃకాల అర్చనలు, అనుష్టానముల అనంతరం గోపూజ నిర్వహించారు. అనంతరం శ్రీవారి కలిశ స్థాపన చేసి అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. శ్రీవారు స్వయంభువుగా వెలిసిన సాక్షిభూతమైన శ్రీపాదానికి అనేక పండ్లరసాలతో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానం నిర్వహించారు సాయంత్రం మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలతో అలివేలుమంగా పద్మావతి సమేతంగా శ్రీవారు గజవాహనంపై గిరిప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కే.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉపప్రధాన అర్చకుడు మురళీ మోహనశర్మ, అర్చకుడు రాజీవ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌టేక్ వెల్‌ను సందర్శించిన ఎస్ఈ



నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఎస్ఈ శేఖర్‌రెడ్డి

అశ్వాపురం ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టెక్‌వెల్‌ను బుధవారం మిషన్‌భగీరథ ఉమ్మడి జిల్లా ఎస్ఈ జి.శేఖర్‌రెడ్డి సందర్శించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు సంబంధించి ఇన్‌టెక్‌వెల్ వద్ద నీటి లభ్యతను ఆయన పరిశీలించారు. ఉమ్మడి జిల్లాకు మంచినీటిసరఫరా చేసే కుమ్మరిగూడెం ఇన్‌టెక్‌వెల్ వద్ద వేసవిలో నీటినిల్వలు ఉండేవిధంగా తీసుకోవల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద 48మీటర్ల నీటినిల్వలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. నీటి నిల్వలు 45మీటర్ల వరకు పడిపోయిన మంచినీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తవని, ఎటువంటి ఇబ్బందినైనా ఎదుర్కోవటానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ఎస్ఈ సూచించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ ఈఈ నళిని, మిషన్ భగీరథ డీఈ మహేందర్‌రెడ్డి, ఏఈలు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'పేట'కు చేరుకున్న రామభక్తుల పాదయాత్ర

అశ్వారావుపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ, తూర్పు, ఏలూరు, అల్లూరి జిల్లాలకు చెందిన వేలాది మంది రామభక్తులు భద్రాచలంలో జరిగే శ్రీ రామనవమిలో పాల్గొనేందుకు పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం ఈ పాదయాత్ర అశ్వారావుపేటకు చేరుకుంది. రామభక్తులు పట్టణంలోకి ప్రవేశించడంతో పట్టణంతో పాటు ఆయా రహదారులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భద్రాచలం పాదయాత్రగ బయలుదేరిన భక్తులకు పట్టణంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచిరాజుగూడెం, గూడురుపాడు, ఎంవీ పాలెం, కస్నాతండా, ఏదులాపురం మున్సిపాలిటి పరిదిలోని వరంగల్‌క్రాస్ రోడ్డు, మద్దులపల్లి, గ్రామాల్లో గురువారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించను న్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.



కేఎంసీకి నీటి కష్టాలు

మేయర్ చాంబర్‌కు చెమ్మ రావటంతో ట్యాంకర్ నుంచి నీటి సరఫరా నిలిపివేత

4రోజులుగా ప్రత్యామ్యాయం చూపని అధికారులు

నీరు లేక తీవ్ర ఇబ్బంది పడ్డ ఉద్యోగులు, ప్రజలు



ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న దృశ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, ఇతర విభాగాలతో సమన్వయలోపం ఖమ్మం నగర పాలక సంస్థలోని వందల మంది ఉద్యోగులకు నీళ్ల కష్టాలతో పాటుగా బయటకు చెప్పుకోలేని మనోవేదనకు గురి చేసింది. గత ప్రభుత్వంలో రూ.33 కోట్ల వ్యయంతో ఖమ్మం నగర పాలక సంస్థ భవనాన్ని నిర్మాణం చేశారు. నిర్మాణ సమయంలోనే నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని బహిరంగ విమర్శలు వ్యాపించాయి. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు నాయకులు నిరసనలు చేయటంతో వారిపై కేసులు సైతం నమోదు జరిగాయి. అయితే కేఎంసీలో నీటి అవసరాలు తీర్చేందుకు మూడో ఫ్లోర్‌లోని మేయర్ చాంబర్‌పై వాటర్ ట్యాంక్ నిర్మాణం చేశారు. గత కొన్ని నెలలుగా వాటర్ ట్యాంక్ నుంచి నీరు కారి చెమ్మ రావటంతో మేయర్ చాంబర్‌లోని గోడలు చెమ్మ వచ్చాయి. వాటిని మరమ్మతు చేశారు. అయినా గోడలకు చెమ్మ ఆగకపోవటంతో వాటర్ ట్యాంక్ నుంచి నీరు లీకు కాకుండా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అయితే నాల్గు రోజుల క్రితమే మరమమ్మతులు జరపాల్సి ఉండగా వెంటనే చేపట్ట లేదు. బుధవారం వాటర్ ట్యాంక్ పనుల కోసం కేఎంసీ భవనంలోని మూడు ఫ్లోర్‌లకు నీటి సరఫరా నిలుపుదల చేశారు. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న 320 మంది ఉద్యోగులు, వివిధ కారణాలతో కేఎంసీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు మరుగుదొడ్ల వద్ద తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. నీటి సరఫరా లేని విషయాన్ని కనీసం అధికారులు మరుగుదోడ్ల వద్ద బోర్డు పెట్టలేక పోయారు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. మరుగుదోడ్ల దుర్వాసన కేఎంసీ కార్యాలయంలోకి వ్యాపించి ఉద్యోగులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. చేసేదేమి లేక కేఎంసీ మెప్మా మెయింటనెన్స్ ఉద్యోగులు వాటర్ ట్యాంక్ నీళ్లను బకెట్‌లతో ఫ్లోర్‌లోకి మోసి మరుగుదోడ్లలో డ్రమ్ములు పెట్టి నీటితో నింపారు. నీటి సమస్యతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ విషయంపై కే ఎంసీ ఇంజనీరింగ్ అధికారి కృష్ణలాల్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా స మస్య తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే ప్రత్యామ్యాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.


శ్లాబ్‌ను పగులకొడుతున్న దృశ్యం

12న 'బొమ్మ'లో టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మ కళాశాలలో ఈ నెల 12న నేషనల్ లెవల్ టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తు న్నట్లు కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్‌లు తెలిపారు. బుధవారం కళాశాలలో ఫెస్ట్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫెస్టులో ఖమ్మం జిల్లా విద్యార్థులతో పాటు, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని, పాల్గొన్న విద్యార్థులకు, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించటం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848760535, 9676756430 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎరువుల దుకాణాల యజమానులకు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. మండల పరిదిలోని పెద్ద తండాలోని జిల్లా మార్క్‌ఫెడ్ గోడౌన్‌లో, తల్లంపాడులోని ఎరువుల దుకాణాలను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన షాపులలో ఎరువుల రిజిస్టర్లతో పాటు ప్రస్తుత నిల్వలను పరిశీలించారు. విత్తనాలకు సంబంధించిన ఫార్మ్-డి క్రమం తప్పకుండా ప్రతి నెల 5వ తేదీ లోపు ఆన్లైన్‌లో సబ్మిట్ చేయాలని సూచించారు. అదేవిదంగా పెద్దతండాలోని జిల్లా మార్క్ ఫెడ్ కార్యాలయంలో ఎరువులను పరిశీలించారు. ఎరువుల సరఫరా వివరాలను జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ సునితు విచారించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉమానగేష్ పాల్గొన్నారు.

వసతులకు నిధులు మంజూరు చేయాలి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం పరిధిలోని బారుగూడెంలోని శ్రీ సిటీలో మౌలిక వసతులు, శానిటేషన్, వీధి దీపాలకు నిధులు మంజూరు చేయాలని బారుగూడెం మాజీ సర్పంచ్ పల్లెర్ల పాండు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మున్సిపాలిటి పరిధిలో ఉపాధిహామీ పనులకు బదులుగా మహిళలకు వంద రోజుల పని దినాలను కల్పించాలని కోరారు. బారుగూడెం పంచాయతీ వరకు ఒకే వార్డు ఉండే విధంగా చూడాలని కోరారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

తిరుమలాయపాలెం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు కాపాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య కోరారు. బుధవారం పిండిప్రోలు రాయల వెంకటనారాయణ స్మారకభవనంలో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్శిటీలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం, దీనిపై నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో అనేక వాగ్ధానాలుచేసి వాటిని విస్మరించారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వందలాది మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మల్లీడి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, మల్లయ్య, పి.వెంకటస్వామి, యడ్లపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

12 ఏళ్ల అనంతరం కుటుంబ సభ్యుల చెంతకు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 12 ఏళ్లుగా మతిస్థిమితం కోల్పోయి వివిధ జిల్లాలు తిరుగుతూ చివరికి గత నెలలో ఖమ్మం నగరంలోని సిటీ బస్టాండ్‌కు చేరుకొని భిక్షాటన చేస్తూ జీవిస్తున్న ఓ మహిళను అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆశ్రయం కల్పించి, వైద్యసేవలు అనంతరం బుధవారం కుటుబ సభ్యులకు అప్పగించారు. సిటీ బస్టాండ్‌లో గత కొంత కాలంగా గుర్తు తెలియని, మతిస్థిమితం లేని మహిళ(50) భిక్షాటన చేసుకుంటూ ఉండటంతో బస్టాండ్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. దీంతో ఆ మహిళను అన్నం ఫౌండేషన్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. వైద్యసేవలు అనంతరం ఆ మహిళ వివరాలు తెలిపింది. పేరు గౌరమ్మ అని, మాది కర్నూల్ జిల్లా ఆలూరు మండలం పెద్ద కొత్తూరు అని, భర్త పేరు నరసింహ అని తెలిపింది. వెంటనే ఆలూరు మండల సీఐకు ఫోనులో వివరాలు తెలిపి వారి కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. దీంతో బుధవారం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన మహిళ కుటుంబ సభ్యులను గుర్తించటంతో అన్నం ఫౌండేషన్ అంబులెన్స్‌లో సొంత గ్రామానికి తరలించి సీఐ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. 12 ఏళ్లుగా ఆమె లేకపోవటంతో భర్త నరసింహ మరో వివాహం చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

నగరంలో జై సంవిధాన్ యాత్ర

పాల్గొన్న డిప్యూటీ మేయర్ ఫాతిమా.. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల



యాత్రలో పాల్గొన్న పువ్వాళ్ల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ యాత్ర నిర్వహకులు మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలో జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. యాత్రలో డిప్యూటీ మేయర్ పాతిమా జోహారా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మార్పు కోసం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల, నాయకులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూపీహెచ్ కాలనీ స్వయంభు అభయ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరగిరినాథుని రామాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో నేత్ర పర్వంగా హోమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి నివేదన, నిరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ , సాయంత్రం నిత్య హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, కార్యదర్శి తిరుపయ్య, కోశాధికారి మల్సూర్ నాయక్, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, ఆలయ కమిటి సభ్యులు అంజయ్య, కొండల్‌రావు, వెంకన్న, మణికంఠ, సుబ్బాచారి, లక్ష్మీ పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి.. కలెక్టర్ నివాళులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ చిత్రపటానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు నేలలో ఎందరో మహానుభావులు ప్రజల కోసం అసువులు బాసారని అన్నారు. అలాంటి వారిని మననం చేసుకునేందుకు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, గౌడసంఘం నాయకులు మిత్రుగౌడ్, అంజయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలి

ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెలాఖరు నాటికి అన్ని మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్లు శ్రీజ, పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఏప్రిల్ తర్వాత మండల స్థాయి కార్యాలయాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వాడొద్దని కలెక్టర్ తెలిపారు. మండలంలో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి రోజు తాగునీటి సరఫరా నాణ్యత తనిఖీ చేయాలన్నారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో బస్‌స్టాప్, ఆటోస్టాండ్ల వద్ద తప్పనిసరిగా చలి వేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలతో మమేకం అయ్యేందుకు అధికారులు సంయమనంతో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఈడీ నవీన్ బాబు, బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమశాఖ అధికారి విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి.పురంధర్, ఎల్డీఎం శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సీపీఐ నాయకులపై కేసుల కొట్టివేత

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా ప్రయోజన నిరసన కార్యక్రమం పోలీసు కేసుల వరకు వెళ్లింది. 2020 ఫిబ్రవరి 21న నాయకులు ఖమ్మంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసు ఖమ్మం జూనియర్ సివిల్ జడ్జీ పరిధిలో వాదోపవాదులు విన్న తర్వాత బుధవారం కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బాగం హేమంతరావుతో పాటుగా అప్పటి జిల్లా కార్యదర్శి దివంగత పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్కే జానీమియా, పోటు కళావతి, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లుపై కేసును కొట్టి వేశారు.


లాయర్లతో కేసు కొట్టివేయబడిన నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నేలకొండపల్లి,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పైనంపల్లి సొసైటీ అధ్యక్షుడు, డీసీఎమ్మెస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు కోరారు. పైనంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాగుబండి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని కోరారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని తద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉసిరికాయల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి జగదీష్, రైతులు మేళ్ళచెర్వు కృష్ణ, యడవల్లి సైదులు, చిల్లంచర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో..

డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ బుధవారం ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడకుండా, మద్దతు ధరను పొందేందులకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏఎంసీ చైర్మన్ అన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని మద్దతు ధరను పొందాలని కోరారు. నేలకొండపల్లితోపాటు అనాసాగరం, కట్టుకాసారం గ్రామాల్లో సైతం డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చిట్టూరి అచ్చయ్య, మీసా నాగేశ్వరరావు, రైతులు జానకిరామయ్య, నగేష్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, రాంబాబు, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల

విక్రయం హేయం: టీడీపీ

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని విక్రయించడం దుర్మార్గమని, ఇది విద్యావ్యవస్థ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందని తెలుగుదేశం నాయకులు కేతినేని హరీష్ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యూనివర్సిటీ భూమిని స్వాదీనం చేసుకోవడాన్ని టీడీపీ ఖండిస్తోందన్నారు. గత ప్రభుత్వం ఏ విధంగా భూములు అమ్మినదో, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందన్నారు. హైదరాబాద్ ప్రజలకు సరైన గాలి వెలుతురు లేక ఇబ్బంది పడుతుంటే, విశాలమైన యూనివర్సిటీ భూమిని విద్యార్థులను భవిష్యత్‌తరానికి ఉపయోగపడే వనరులని ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. అసలు అది యూనివర్సిటీ భూమి కాదు, ప్రభుత్వ భూమి అనడం ఏమిటి? యూనివర్సిటీ లో చదివే పిల్లలు ప్రభుత్వంలో భాగం కాదా? యూనివర్సిటీ ప్రభుత్వంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి దురాగతాన్ని విరమించుకోవాలని హితవుపలికారు. భూమిని అక్రమించడానికి వెళుతున్న ప్రభుత్వ అధికారులపై వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసులు పెట్టాలని టీడీపీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, నాగార్జునవు శ్రీనివాస్, కోనేటి సురేష్, తాళ్లూరి నారాయణ, చావా నరేందర్, రమేష్, చల్లగుండ్ల, జ్యోతిబసు, మల్లెంపాటి లహరిస్ తదితరులు పాల్గొన్నారు.

భూముల వేలం నిలిపివేయాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూమల వేలం పాటను నిలుపుదల చేసి భవిష్యత్‌లో మళ్లీ ఇటువంటి వివాదాలు రాకుండా పూర్తి స్థాయిలో భూముల్ని యూనివర్సిటీకే అప్పగించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసుల్ని తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు బుగ్గవీటి సరళ, ఎం సుబ్బారావు, మాదినేని రమేశ్, బండి పద్మ, దొంగల తిరుపతి రావు, నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

తిరుమలాయపాలెం: హైదరాబాదులో ప్రభుత్వ భూములు కాపాడాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీచార్జీని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా జాతీయ రుహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు.



రాజీవ్ యువ వికాసం పథకం కోసం 4కౌంటర్లు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 4కౌంటర్ల ద్వారా అందజేయాలని కమిషనర్ కొండ్రా నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులు ఈ దరఖాస్తులను ఈనెల 14వ తేదీ వరకు స్వీకరిస్తామని, వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు. అదేవిధంగా మండలంలోని 23గ్రామ పంచాయతీలకు చెందిన వారికోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

చింతకాని ఇన్‌చార్జి ఎంఈవోగా రామారావు

చింతకాని, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి మండల విద్యాశాఖ అధికారిగా మండల పరిధిలోని పొద్దుటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాలాది రామారావును నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రామారావు వైరా ఎంఈవోగా పని చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోకు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం

- కంకరతేలి కనిపిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



పైకి కన్పిస్తున్న కంకర

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు అభివృద్ధి పనుల్లో నాణ్యతను గాలికొదిలేశారనే విమర్శలు విన్పిస్తున్నాయి. దాదాపు పదినెలల కిందట మొదలుపెట్టిన ఈ రోడ్డు నిర్మాణం నత్తనడకను తలపిస్తుంది. అయితే ప్రస్తుతం ఒకవైపు రోడ్డుపై బీటీ వేసేందుకు బుధవారం ఏర్పాట్లు చేశారు. బీటీ వేసే రోడ్డుపైన చాలా చోట్ల కంకరరాళ్లు పైకి కన్పిస్తున్నాయి. అంతేకాకుండా ఈ రోడ్డు అంచునే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో దాదాపు ఐదారు అడుగుల లోతులో తవ్విన గుంత దర్శనమిస్తుంది. ఆగుంత అంచు నుంచే బీటీ రోడ్డు నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు సిద్ధమవ్వడంతో స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. రూ.12కోట్ల నిధులతో 2.6కిలోమీటర్ల దూరం రోడ్డును నాలుగువరుసల రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ప్రస్తుతం వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపం వరకు ఒకవైపు రెండువరుసల రోడ్డుకు బీటీ వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ రోడ్డులో చాలా చోట్ల కంకర సరిగా రోడ్డులో కలిసిపోలేదు. సరైన వాటర్‌క్యూరింగ్ చేయకపోవడంతో రోడ్డు నాణ్యతపై అనేక అనుమానాలు ఉన్నాయి. కంకర లభ్యత లేదనే కారణంతో కొన్ని సమయాల్లో హడావుడిగా దానిని తీసుకువచ్చి రోడ్డుపైన పరిచారు. అవసరం మేరకు వాటర్ క్యూరింగ్, రోలింగ్ చేయకపోవడంతో రోడ్డు గట్టి పడలేదని స్థానికులు చెప్పుకుంటున్నారు. కంకర సరిగా అణగకుండానే బీటీ వేస్తే ఎంత కాలం మన్నికతో ఉంటుందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు నాణ్యతో బీటీ రోడ్డును నిర్మించాలని, రోడ్డు అంచున ప్రమాదకరంగా ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ గుంతలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక సర్వాయి పాపన్నగౌడ్

- తెలంగాణ రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ



పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయుడు సత్యనారాయణ

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అని తెలంగాణ రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ పేర్కొన్నారు. వైరాలో బుధవారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. సర్వాయి పాపన్న విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, గౌడసంఘం ప్రతినిధులు పర్సా రవి, పెద్దప్రోలు లక్ష్మయ్య, మాచర్ల శంకర్, ధర్మారావు, నాగేశ్వరరావు తదితరులు కూడా పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు.



పెనుబల్లిలో..

పెనుబల్లిలో...

పెనుబల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతి కార్యక్రమాన్ని గౌడసంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమాల్లో పంది వెంకటేశ్వరరావు, వేముల కృష్ణయ్య, వేముల నర్సింహారావు, వంగా గిరిజాపతిరావు, బొర్రా వెంకటేశ్వర్లు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, బజ్జూరి నాగేశ్వరరావు, చలమాల విఠల్‌రావు, టీడీపీ సీనియర్ నాయకుడు కనగాల సాంబశివరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కవి గోపిశెట్టి వెంకటేశ్వరరావు, పంతంగి వెంకటేశ్వరరావు, మేకతొట్టి కాంతయ్య, తడికమళ్ల చిరంజీవి, గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

బోనకల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఇసుక అవసరమని, మండలంలో ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ పున్నం చందర్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు దీంతో బుధవారం కలకోట, రాయనపేట, మోటమర్రి, బ్రాహ్మణపల్లి గ్రామాల వద్ద ఉన్న ఇసుక రీచ్‌లను మైనింగ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, గిర్దావర్ మైథిలి, సర్వేయర్ కృష్ణమూర్తిలు పరిశీలించారు. బ్రాహ్మణపల్లి మినహా మిగిలిన చోట్ల ఇసుక లభ్యత లేదని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మట్టా రాగమయి



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని శ్రీనివాసా టాకీస్ రోడ్‌లోని చౌకదుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డీలర్లు పాల్గొన్నారు.

ప్రతి గడపకు పథకాలు

తల్లాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హతగల ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం ఆమె తల్లాడ మండలంలో విస్తృతంగా పర్యటించారు. నూతనకల్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తల్లాడ రైతు వేదికలో 23మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తల్లాడలో గ్రూప్-1లో ప్రతిభ చాటిన ర్యాంకర్లు గోపిశెట్టి సుస్మిత, చింతా రాహుల్‌ను సన్మానించారు. నారాయణపురంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్ఐ బి.కొండల్‌రావు, సొసైటీ చైర్మన్లు తూము వీరభద్రరావు, దిరిశాల నర్సింహారావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, నాయకులు రాయల రాము, గుర్రం శ్రీనివాసరావు, పోతురాజు కోటయ్య, మూకర ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మిగులు ఆదాయం కలిగిన తెలంగాణ రాష్ట్రాన్ని తన పదేళ్ల పాలనలో కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విమర్శించారు. మండలంలోని వల్లాపురం గ్రామంలో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జై బాపూ.. జై భీమ్... జై సంవిధాన్ అభియాన్ యాత్రను ఆగ్రామంలోని అన్ని వీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వైరాలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, ఏదునూరి సీతరాములు, గుమ్మా రోశయ్య, మచ్చా బుజ్జి, ధార్న రాజశేఖర్, ఇటుకాల మురళీ, పమ్మి అశోక్, చింతనిప్పు మాధవరావు, తుమ్మల సత్యం, మురళీ, పుల్లారావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరామనేని తిరుపతిరావు, దొడ్డా పుల్లయ్య పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో 129వ ర్యాంకు సాధించిన సంగెపు లక్ష్మీసాహితిని బుధవారం తమ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అభినందించి సన్మానించారు. తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, కవితలను అభినందించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, నాయకులు మచ్చా బుజ్జి, కట్ల సంతోష్, మోరంపూడి మధు, శైలజా పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): న్యూలిటిల్‌ఫ్లవర్ ప్రైడ్ క్యాంపస్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ ఈ వేడుకలను ప్రారంభించారు. వివిధ పోటీల్లో రాణించిన చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం సీపీఎం రాస్తారోకో

బోనకల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పున్నం చందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వం గుణపాఠాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, తుళ్లూరు రమేష్, కారంగుల చంద్రయ్య, సత్యనారాయణ, లక్ష్మణరావు, పంతు, నరేష్, శ్రీనివాసరావు, వీరబాబు, సునీత పాల్గొన్నారు.

ముగిసిన కోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

కారేపల్లి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో గల శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్ర బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆలయప్రాంగణంలోని దేవతమూర్తులకు పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పర్సాపట్టాబి రామారావు, విజయలక్ష్మి దంపతులు, ఆలయ ఈవో వేణుగోపాలచార్యులు, పూజారి కైలాష్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హోమంలో పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈసందర్భంగా ఇల్లెందు పట్టణానికి చెందిన సింగరేణి మర్చంట్స్‌వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమన్ని అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్‌కిషోర్ ఖండేల్వాల్, కార్యదర్శి జగన్నాథం ప్రారంభించారు. కార్యక్రమంలో తాటిపల్లి సుబ్బారావు, పగడాల మోహన్‌కృష్ణ, పర్సాసాయి తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ ప్రసాద్ కుటుంబానికి పరామర్శ

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ వీఎస్ఆర్ ప్రసాద్ కుటుంబాన్ని ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్, సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మిలు బుధవారం పరామర్శించారు. కల్లూరులోని ఆయన నివాస గృహంలో కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సానుభూతి సంతాపం తెలిపారు. ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, విలేజ్ బస్ రూట్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, కల్లూరు కంట్రోలర్ వెంగళ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వీల్‌చైర్ వితరణ

పెనుబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో రెండు కాళ్లు పనిచేయక ఇబ్బంది పడుతున్న యువతికి జోనెబోయిన ట్రస్టు ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను బుధవారం ట్రస్టు నిర్వాహకురాలు జోనెబోయిన అన్నపూర్ణ అందజేశారు. యువతి తల్లికి అనారోగ్యం, తండ్రి కూలీపనులు చేసి కుటుంబాన్ని పోషించడం ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని తెలుసుకొని రూ.8వేల విలువైన వీల్‌చైర్‌ను యువతి తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో మిట్టపల్లి కిరణ్‌కుమార్, భూక్యా ప్రసాద్, వంగా నిరంజన్, మేకతొట్టి కాంతయ్య, గోగినేని రమేష్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న వెంకయ్యబాబు

మధిర రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ ముప్పా వెంకయ్యబాబు ప్రారంభించారు. బడుగు బలహీనవర్గాలు, నిరుపేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడే ఉచిత సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముదిగొండలో...

ముదిగొండ: తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని గోకినపల్లి గ్రామంలో ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, సామినేని వెంకటయ్య, కందిమళ్ల వీరబాబు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



ముదిగొండలో...

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని జవహర్ నగర్‌లో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేయగా సాయంత్రం పట్టణ పుర వీధులలో మేళతాళాలతో కల్యాణ ఉత్సవ మూర్తులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు కొదమసింహం లక్ష్మణాచార్యులు, ఫణికుమార్, నిర్వహకులు కంచేటి రమేష్, గంధం మోహన్, గట్టే వాసు, పెండ్ర బాపయ్య, దేవళ్ల శ్రీను, రామకృష్ణ, కాశీ విశ్వనాథ్, కంచెపోగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడి అరెస్టు

తల్లాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో లంబాడీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిముట్టడి కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి మండలంలోని రంగంబంజరలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్ తదితరులను తల్లాడ పోలీసులు అరెస్టు చేశారు. దశరథ్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి తేజావత్ బాలాజీనాయక్, బాణోతు సాయినాయక్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

లింగాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

కల్లూరు, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామంలో డీసీఎంఎస్ త రుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, తహసీల్దార్ సాంబశివుడులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సత్యం బాబు, ఏవో రూప, ఏఎంసీ డైరెక్టర్ దేవరపల్లి నాగమణి, దేవరపల్లి వెంకటేశ్వరరావు, మంగపతి, పెద్దబోయన శ్రీనువాసరావు, బత్తుల రాము, బైర్ల కాంతరావు, రాచబంటి శ్రీను పాల్గొన్నారు.

సిగ్నల్ సమస్యతో నిలిచిన గూడ్స్‌రైలు

- ఎండలో ఇబ్బందులుపడిన వాహనదారులు

కారేపల్లి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి నుంచి ఇల్లెందుకు వెళ్లే రైల్వేగేట్‌లో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్లాట్ ఫాంపైకి వెళ్లాల్సిన గూడ్స్‌రైలు గేటులో నిలిచిపోయింది. దీంతో గేటుకు ఇరువైపుల నిలిచిపోయిన వాహనదారులు ఎండవేడికి అవస్థలు పడ్డారు. కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. కొన్ని గంటలతరువాత అధికారులు సిగ్నల్‌ను సరిచేయడంతో వాహనదారులు వెళ్లిపోయారు. ఇదే గేటులో తరచుగా ఇలా సిగ్నల్ పాయింట్ మొరాయించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సంబంధిత రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు

- సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి వీరభద్రం



వైరాలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హెచ్చరించారు. హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీలో జరుగుతున్న నిర్బంధకాండకు వ్యతిరేకంగా బుధవారం వైరాలోని జాతీయ ప్రధాన రహదారిపై క్రాస్‌రోడ్డు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తల్లాడలో రాస్తారోకో చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో జరిగిన రాస్తారోకోనుద్దేశించి సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు, షేక్.మస్తాన్, సత్తెనపల్లి నరేష్, రాజబోయిన సైదులు, బస్విరెడ్డి, రాములు పాల్గొన్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల: అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ తెలిపారు. బుధవారం కొణిజర్ల పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, బోయినపల్లి శ్రీనివాస్‌రావు, జోనెబోయిన అంజయ్య, తేజావతు సీతరాములు, షేక్ అఫ్జల్, గోపయ్య, పద్మినితిలకం, కుమారి, డెవిడ్, జట్ల రవి, వెంకటనారాయణ, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి: ప్రభుత్వ భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించటాన్ని వ్యతిరేకిస్తున్న సీపీఎం నాయకులను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం వీఎంబంజర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గాయం తిరుపతిరావు, కండే సత్యం, చిలకా రామచంద్రుడు, అరుణప్రతాప్ పాల్గొన్నారు.



తల్లాడలో...



కొణిజర్లలో...



పెనుబల్లిలో...

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడలి: సీపీఐ

బోనకల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కొంగర భాస్కరరావు, గుంపుల జయాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో జీవించాలి

మధిర రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శాంతి సమాధానంతో క్రీస్తు మార్గంలో జీవించాలని పాదర్ తమ్మి పేర్కొన్నారు. బుధవారం మధిర మండలం సిరిపురం గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బుజ్జీ, నాయుడు, గాబ్రిల్, బాలయేసు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

13న వైరాలో టీయూసీఐ ప్రథమ మహాసభ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభలు ఈనెల 13న వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపం(కామ్రేడ్ ఆడెపు రామారావు నగర్)లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మునిసిపాలిటీతో పాటు జేవీఆర్ ఓసీలో కార్మికులతో కలిసి పోస్టర్లను సత్తుపల్లి ఏరియా కమిటీ కార్యదర్శి అమర్లపూడి శరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూచి రవి, పుల్లారావు, ప్రతాప్, పోతురాజు, కట్టా ప్రసాదు, సురేష్, కనకయ్య, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భౌతికకాయానికి నివాళి

వైరా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-పందిళ్లపల్లి మధ్య గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన పోలీస్ కానిస్టేబుల్ బండి కృష్ణ అంత్యక్రియలు బుధవారం వైరా మండలంలోని స్వగ్రామమైన రెబ్బవరం గ్రామంలో జరిగాయి. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృష్ణ బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతదేహాన్ని రెబ్బవరం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నేలకొండపల్లి, వైరా ఎస్ఐలు సతీష్, వంశీకృష్ణ భాగ్యరాజ్, పోలీస్ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహచర పోలీస్ కానిస్టేబుళ్లు కృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించారు. దహన సంస్కారాల కోసం రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు.